



# కరపత్రం

SINCE 2014

మంగళవారం జూలై 15 2025 | సంపుటి :0 | సంచిక :270 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




# ఆహారభద్రతకు ప్రభుత్వం కృషి

## కొత్త రేషన్ కార్డుల పంపిణీ సీఎం ట్వీట్

తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సూర్యాపేట జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైంది. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందించాలని లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుంది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర ట్వీట్ చేశారు. సన్నబియ్యం పంపిణీతో తెలంగాణ పల్లెల్లోని రేషన్ షాపుల వద్ద సందడి సంతరించుకుంది. కొత్త రేషన్ కార్డుల కోసంపేదవాడి పదేళ్ల ఎదురు చూపులు నేడు ఫలించబోతున్నాయి. రాష్ట్రంలో 5.61 లక్షల మందికి కొత్త రేషన్ కార్డులు, 3.10 కోట్ల మందికి ఆహార భద్రత, ఒక్కొక్కరికి ఆరు కేజీల ఉచిత సన్నబియ్యం. ఇదీ పేదల సంక్షేమం పట్ల మా వజ్ర సంకల్పం అని పేర్కొన్నారు. అలాగే ఉజ్వల తెలంగాణ భవితే లక్ష్యంగా రాష్ట్ర పునర్ నిర్మాణం కోసం తమ ప్రభుత్వం చేస్తోన్న యజ్ఞం దిగ్విజయం అయ్యేలా ఆశీర్వదించమని ఉజ్జయిని మహంకాళిని మనసారా కోరుకున్నంట్లు మరో ట్వీట్‌లో సీఎం పేర్కొన్నారు. 2లో

# రామోజీ ఫిల్మ్‌సిటీలో ' శ్రీమద్భాగవతం చిత్రీకరణ

## ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్

2లో..

# వెన్నాడుతున్న కెసిఆర్ పాలనా వైఫల్యాలు

- »ఎపి ప్రాజెక్టులను పట్టించుకోకుండా ఇప్పుడు విమర్శలు
- »వ్యవసాయారంగాన్ని అభివృద్ధి చేయడం కాంగ్రెస్ లక్ష్యం
- »పాలేర్ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసిన భట్టి,పొంగులేటి



కేసీఆర్ పాలనలో చేసిన తప్పిదాలకు నేడు తమ ప్రభుత్వం మూల్యం చెల్లిస్తోందని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గతంలో శ్రీశైలంపైన ఏపీ ప్రభుత్వం ప్రాజెక్ట్‌లు కడుతుంటే అడ్డుకోకుండా కేసీఆర్ ప్రభుత్వం సహకరించిందని మండిపడ్డారు. ఆనాడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్‌ల నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాటాలు చేశామని గుర్తుచేశారు. ఆనాడు కేసీఆర్, హరీష్‌రావు, కేటీ-ఆర్ తప్పులు చేసి వాటిని ఇప్పుడు తమపై రుద్దాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని అన్నారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసి కాపాడుకుంటామని భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం, కరెంట్, ప్రాజెక్ట్‌లు అని అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయం, రైతులకు అండగా నిలిచిందని చెప్పారు. 2లో

# మహిళా పేషెంట్ పట్ల అసభ్య ప్రవర్తన

## వార్డుబాయ్‌ను చితకబాది పోలీసులకు అప్పగింత




హైదరాబాద్ విద్యానగర్ లోని ఆంధ్ర మహిళా సభ ఆసుపత్రిలో దారుణం వెలుగుచూసింది. ఓ వార్డ్ బాయ్ మహిళా పేషెంట్ పై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స కోసం వచ్చిన ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. అసభ్య ప్రవర్తనతో మహిళా పేషంట్ కేకలు వేసింది. మహిళా పేషంట్ అరుపులతో సిబ్బంది అప్రమత్తమయ్యారు. అక్కడే ఉన్న బాధితురాలి కుటుంబ సభ్యులు వార్డ్ బాయ్ ని చితకబాదారు. అనంతరం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు- తెలిపారు. అసభ్యంగా ప్రవర్తించిన వార్డుబాయ్ ని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

### తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలి:


## మహిళా కమిషన్‌కు ఫిర్యాదు



రెజిమెంటల్ బజార్: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ జాగృతి మహిళా నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయంలో ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఛైర్ పర్సన్ నేరెళ్ల శారద అందుబాటులో లేకపోవడంతో కమిషన్ సభ్యులు సుదం లక్ష్మీ, రేవతి రావు, ఉమ, అఫ్రోజ్ షహీనాకు ఫిర్యాదు పత్రం అందజేశారు. ముందస్తు సమాచారం ఇచ్చినా ఛైర్‌పర్సన్ అందుబాటులో లేకపోవడంపై జాగృతి నాయకులు అసహనం వ్యక్తం చేశారు. ఛైర్ పర్సన్ అందుబాటులో లేరని చెబుతూ సెక్రటరీ సైతం ఫిర్యాదు లేఖను తీసుకోవడానికి అంగీకరించలేదని వారు ఆరోపించారు. మహిళలను కించపరిచే వ్యక్తుల విషయంలో ఇలాంటి వైఖరి మంచిది కాదన్నారు. స్పందించిన కమిషన్ సభ్యులు ఫిర్యాదును స్వీకరించి ఛైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో మరిపల్లి మాధవి, సీనియర్ నాయకులు వరలక్ష్మీ, పడాల మనోజ, దేశపాక సుచిత్ర, సంధ్య రెడ్డి, షాహీన్, పరమేశ్వరి, కుసుమ రజిత, రజితా రెడ్డి తదితరులు ఉన్నారు.

# జల వివాదం..

## తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీకి కేంద్రం ఏర్పాట్లు





దిల్లీ: జల వివాదంపై చర్చకు తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీకి కేంద్రం ఏర్పాట్లు చేసింది. ఈ నెల 16న దిల్లీలో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం కావాలని కేంద్రం కోరింది. ఈ మేరకు వీరిద్దరిని ఆహ్వానిస్తూ కేంద్ర జల్‌శక్తి శాఖ సర్క్యులర్ విడుదల చేసింది. ఈ భేటీకి హాజరయ్యేందుకు ఇద్దరు సీఎంలకు వీలవుతుందో లేదో తెలపాలని పేర్కొంది.

మరోవైపు కృష్ణా, గోదావరి వాటాల సాధనకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. కృష్ణాపై రాష్ట్రంలోని ప్రాజెక్టులకు క్లియరెన్స్ ఇవ్వాలని, నీటి కేటాయింపులు, ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలని కేంద్రాన్ని సీఎం కోరనున్నారు.

రేపు దిల్లీ వెళ్లనున్న ఏపీ సీఎం చంద్రబాబు

ఏపీ సీఎం చంద్రబాబు మంగళవారం దిల్లీ వెళ్లనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆయన అక్కడికి చేరుకోనున్నారు. కేంద్రమంత్రులు అమిత్‌షా, అశ్వినీ వైష్ణవ్, సీఆర్ పాటిల్‌తో సమావేశం కానున్నారు. ఈనెల 17న రాత్రి 9 గంటలకు తిరిగి విజయవాడకు చంద్రబాబు చేరుకోనున్నారు.

# నేటి నుంచి భారత్-అమెరికా వాణిజ్య చర్చలు..!

ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం భారత్-అమెరికా మధ్య నేటి నుంచి మరో విడత చర్చలు అమెరికాలోని వాషింగ్టన్‌లో మొదలుకానున్నాయి. 2లో

# అన్‌డాకింగ్ విజయవంతం..

## మరికొన్ని గంటల్లో భూమిపైకి శుభాంశు

యాక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా, మరో ముగ్గురు వ్యోమగాములు మరికొన్ని గంటల్లో భూమి మీదకు రానున్నారు.



2లో

# ఆస్పత్రిలో చేరిన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్



2లో

దిల్లీ: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అస్వస్థతకు గురయ్యారు. తీవ్ర ఇన్ఫెక్షన్ కారణంగా దిల్లీలోని ఓ ఆస్పత్రిలో చేరినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఆయన చికిత్సకు స్పందిస్తున్నట్లు తెలిపాయి. ఒకట్రెండు రోజుల్లో విధులకు హాజరవుతారని పేర్కొన్నాయి.

# సంపాదకీయం

## శతజయంతి ఉత్సవాల సందడేదీ




తెలుగు మాట వినిపిస్తేనే ఒంటిపై తేళ్ళు పాకినట్లుగా వ్యవహరించిన మీర్ ఉస్మాన్ అలీఖాన్‌ను ముక్కుసూటిగా "ఓ నిజాము పిశాచమా! కానరాడు నిన్నుబోలిన రాజు మాకెన్నడేని" అని ధిక్కరించినవాడు దాశరథి! "దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్" అని గురజాడ చెప్పిన స్థాయిలో%-% "ఘోర గహనాటడవులన్ వడగొట్టి, మంచి మాగాణములన్ సృజించి, యముకల్ నుసి చేసి, పొలాలు దున్ని, భోషాణములన్ నవాబునకు స్వర్ణము నింపిన రైతుదే, తెలంగాణ రైతుదే" అన్నాడు. "ముసలి నక్కకు రాచరికంబు దక్కునే" అని ముష్కర నవాబును ఎదిరించిన కవికి ఎన్ని గుండెలు ఉండాలి. అలాంటి ప్రజాకవి దాశరథి శతజయంతి ఈ నెల 22వ తేదీన జరగనున్నది. హైదరాబాద్ రాజ్యాన్ని పాలించిన కుటిలమైన రాజుపై క్షేత్రంలో నిలబడి, సామాజిక ఆర్థిక అంశాలు ప్రస్తావిస్తూ, జనసామాన్యాన్ని చైతన్యపరుస్తూ, విప్లవాత్మకంగా పోరాటం చేసిన కవులు తెలుగు సాహితీలోకంలో దాశరథి మినహా మరొకరు లేరు. నిజాం రాజు దుష్టపాలనను ఎత్తిచూపుతూ కవితలు చెప్పటం ఏదో ఒక ఎయిర్ కండీషన్డ్ గదిలో కూర్చుని సినిమా పాటలు రాసినంత, కార్యాచరణ చేతగానివారు శ్రీరంగనీతులు బోధించినంత సులభం కాదు.

దాశరథి కవితలోని చరణం %-% "నా తెలంగాణ కోటిరత్నాల వీణ" అన్నది తెలంగాణ రాష్ట్ర పోరాటవీరులకు నినాదమైందన్న విషయం విస్మరించరానిది. అది ఏకవాక్యమైనా ప్రత్యేకమైనది, పసందైనది, పండిన కవితకు పరాకాష్ఠ అయింది. కాబట్టి గత ప్రభుత్వం ఆయన స్మృతిని గౌరవించక తప్పలేదు. అయితే ఏటేటా ఆయన స్మారకార్థం ఒక వర్ధమాన కవికి పురస్కారం ప్రదానం చేసినంత మాత్రాన ఆయన టిఆర్ఎస్ పార్టీ చెందినవాడైపోడు! పైగా కేసీఆర్ నిజాంను దేవుడులా కొలిస్తే, దాశరథి నిజాంను 'పిశాచి'గా అభివర్ణిస్తూ తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టిన దేశాభిమాని, ఆత్మాభిమాని మరి.

వాస్తవానికి దాశరథి ఒక జాతీయకవి. కాబట్టే జలగం వెంగళరావు హయాంలో వారిని ఆస్థానకవిగా నియమించి గౌరవించారు. కానీ తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తరువాత ఎన్.టి. రామారావు అర్ధాంతరంగా ఆయనను ఆ పదవి నుంచి తొలగించారు. అసలు దాశరథి ఎవరో, ఏమిటో ప్రభుత్వాధినేత అర్థం చేసుకుని ఉంటే, ఆయనకు మరొక పదవి కట్టబెట్టి ఆస్థాన కవి పదవి రద్దు చేసేవాడు. ఇలా ఆస్థాన పదవులను నియమించే సంప్రదాయం బ్రిటన్‌లో మూడు వందల సంవత్సరాలుగా కొనసాగుతున్నది. అక్కడ రాజరికం ఉన్నప్పుడూ ఉంది, ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాతా ఉంది. ఆస్థాన కవి పదవి ప్రజాస్వామ్య విరుద్ధమని, రాచమర్యాద అని ఎవరైనా అంటే అంతకన్నా అజ్ఞానం ఉండదు. రెండు వందల సంవత్సరాల పైచిలుకుగా ప్రజాస్వామ్యంగా వర్ధిల్లుతున్న అమెరికా సంయుక్త రాష్ట్రాలలో%-% దాశరథి ఆస్థానకవిగా కొనసాగిన సమయంలోనే%-% 19 రాష్ట్రాలలో ఆస్థానకవులు ఉన్నారు. సోషలిస్టు దేశాలలో చూస్తే%-% తజికిస్తాన్ రాష్ట్రానికి మిర్జో తుర్సునజోదా ఆస్థానకవి. ఇలా ఎన్నో ఉదాహరణలను చూపించవచ్చు.

జాతీయ కవి స్థాయికి అర్హత గల కవిత్వం ఎంతో రాశారు దాశరథి. స్వాతంత్ర్య సమరగీతాలు, జయభారతీ అంటూ దేశభక్తి పొంగిపొర్లే పద్యాలు రాసారు. "జండా ఒక్కటె మూడు వన్నెలదిబీ దేశంబొక్కటే భారతాఖండాసేతు హిమాచలోర్వరబీ కవీట్కాండమ్ములోనన్ రవీంద్రుండొక్కండె కవీంద్రుండుబీ ఊర్జిత జగద్యుద్ధాలలో శాంతికోదండోద్యద్విజయుండు గాంధి ఒకడే, తల్లీ! మహాభారతీ!" అని శిలాక్షరాల్లాంటి పద్యాలెన్నో పాడారు. అందుకే ఆ రోజుల్లో విజ్ఞులైన రాజకీయవేత్తలు %-% సర్వేపల్లి రాధాకృష్ణన్, బూర్గుల రామకృష్ణరావు, పి.వి. నరసింహారావు, బెజవాడ గోపాలరెడ్డి, మర్రి చెన్నారెడ్డి లాంటి వారు మహానుభావులు దాశరథిని ఎంతో అభిమానించారు, గౌరవించారు.

పశ్చిమబెంగాల్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో మంత్రులకే కాదు శాసనసభ్యులకు కూడా వారి మాతృభాష పట్ల, సాహిత్యం పట్ల, సంస్కృతి పట్ల అపారమైన అభిమానం. బెంగాలీలు జాతీయకవిగా గౌరవించే రవీంద్రనాథ్ ఠాగూర్‌కు, తమిళులు దేశీ కవిగా నెత్తిన పెట్టుకొనే సుబ్రహ్మణ్యభారతికి, కన్నడిగులు రాష్ట్రకవిగా కొలిచే కె.వి. పుట్టప్పలకు ఏమాత్రం తీసిపోకుండా జగత్ కళ్యాణం కోసం అచంచల విశ్వా సంతో దేశభక్తి గీతాలను, అక్షర లక్షలు చేసే అభ్యుదయ కవితలను, ఏ ఇజాల జోలికి పోకుండా మానవతా దృష్టితో పలికిన వైతాళికుడు దాశరథి. అదేమి విచిత్రమోగాని తెలంగాణ లోని రాజకీయనాయకులకు ఆ పరంపర సంక్రమించలేదు.

దాశరథి శతజయంతి ఉత్సవాలు తెలంగాణలోని ప్రతిజిల్లాలో ఘనంగా, స్ఫూర్తి దాయకంగా నిర్వహించవలసిన తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఇంకా కిమ్మనకుండా కూర్చోవడం విచారకరం. తెలంగాణకు పేరుకు సాహిత్య అకాడమీ, సాంస్కృతికశాఖ ఉన్నాయి. కాని ఇలాంటి అంశాలలో అవి అంటీముట్టనట్టుగా ఉన్నాయి. వాస్తవానికి ఈ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సాహిత్య అకాడమీకి రాష్ట్రమంతా వెతికినా సరైన అధ్యక్షుడు దొరకకపోవడం గమనించదగినది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వానికి కనీసం సాంస్కృతిక సలహాదారు ఒకరు ఉన్నా గుడ్డికన్నా మెల్లలా ఉండేది.

ఈమధ్యే దక్షిణ భారత దేశంలోనే తొలుదొలుత జానపద సాహిత్యంపై పరిశోధన చేసి విశ్వవిద్యాలయాల్లో జానపద వాఙ్మయ, కళల ప్రవేశానికి ఆద్యుడైన బిరుదురాజు రామరాజు శతజయంతి జరిగింది. అంతకుముందు ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో ఎంతగానో కృషిచేసిన దివాకర్ల వెంకట అవధాని శతజయంతి జరిగింది. ఇప్పుడు తెలంగాణ మహాకవి దాశరథి శతజయంతి వచ్చింది. శతజయంతి ఉత్సవాలను ఘనంగా, స్ఫూర్తిదాయకంగా నిర్వహించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఏమీ పట్టనట్టు మీనమేషాలు లెక్కిస్తే కేంద్రసాహిత్య అకాడమీ రంగంలోకి దిగడం సంతోషమే. కానీ, వారు ఈ జయంతి ఉత్సవాలను "క్లాస్‌రూమ్" స్థాయి కార్యక్రమాలుగా చేసేసి, చేతులు దులుపుకోవడం తెలుగువారిని ఒకసారి ఆలోచించుకోవడానికి దోహదం చేసింది. ఈ దశ లోనూ మహాకవి దాశరథి శతజయంతి ఉత్సవాలు నిర్వహించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం క్రియాశూన్యంగా వ్యవహరిస్తున్నది. ఇంతకూ మన కాలం మహాకవి దాశరథి శతజయంతి ఉత్సవాలు ప్రభుత్వం జరపకుంటే జరగవా?

# రామోజీ ఫిల్మ్‌సిటీలో ' శ్రీమద్భాగవతం చిత్రీకరణ

రామాయణం, మహాభారతం మన జీవితాల్లో భాగమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో 'శ్రీమద్భాగవతం-పార్ట్1' చిత్రీకరణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు. సాగర్ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ దీన్ని రూపొందిస్తోంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో శ్రీమద్భాగవతం చిత్రీకరణ రాష్ట్రానికి గర్వకారణం. రామోజీరావు ఫిల్మ్‌సిటీ-ని అద్భుతంగా నిర్మించారు. నేను యూనివర్సల్ స్టూడియో చూడలేదు. రామోజీ ఫిల్మ్‌సిటీ-.. దేశంలోనే ప్రత్యేకమైన స్టూడియో. ఇది తెలంగాణలో ఉందని చెప్పేందుకు గర్విస్తున్నా. శ్రీమద్భాగవతం సినిమా తీయాలన్న ఆలోచన వచ్చినందుకు మూవీ టీమ్‌ను అభినందిస్తున్నా. నలభయేళ్ల క్రితం రామాయణం సీరియల్ అందరికీ చేరువైంది. కొవిడ్ సమయంలో మళ్లీ ఆ సీరియన్‌ను టెలికాస్ట్ చేస్తే ప్రపంచ రికార్డు సృష్టించింది. 2035లోపు తెలంగాణను 1 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దాలని మేం సంకల్పించాం. 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీగా ఉండేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. దీనికోసం 2047 విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేసుకుంటు-న్నాం. ఇందులో సినీ రంగానికి ప్రత్యేక చాప్టర్ ఉంటు-ంది. నాడు రామానంద్ సాగర్ తీసిన రామాయణం సీరియల్ ఎంత పాపులర్ అయిందో.. 'శ్రీమద్భాగవతం పార్ట్-1' కూడా అంత హిట్ అవ్వాలని కోరుకుంటున్నట్లు రేవంత్‌రెడ్డి అన్నారు.

## వెన్నాడుతున్న కెసిఆర్ పాలనా వైఫల్యాలు

మొదటి పేజీ తరువాయి

సోమవారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్ నుంచి సాగర్ నీటిని డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విడుదల చేశారు. జిల్లాలో 2.50లక్షల ఎకరాలకు పాలేరు రిజర్వాయర్ నుంచి 1500 క్యూసెక్కుల సాగు నీటిని రెండో జోనుకు మంత్రులు విడుదల చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. ఇవాళ సాగర్ రెండో జోన్‌కు సాగునీరు విడుదల చేశామని తెలిపారు.గత కేసీఆర్ ప్రభుత్వ నిర్ణయాలు తెలంగాణ రాష్ట్రానికి భారంగా మారాయని ఆరోపించారు. రైతులు పండించిన పంటకు పెట్టు-బడిగా రైతు భరోసా, రూ.9 వేల కోట్లు- ఇచ్చామని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వంలో సన్నవడ్లకు బోనస్ ఇచ్చామని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడలేదని భట్టి విక్రమార్కమండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే.. వ్యవసాయం, కరెంటు-, ప్రాజెక్టులు అని అన్నారు. ఎపి ప్రభుత్వం ప్రాజెక్టులు కడుతుంటే..మాజీ సిఎం కెసిఆర్ పట్టించుకోలేదని విమర్శించారు. ఆనాడు తప్పిదాలు చేసిందంటే కెసిఆర్, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు అని తెలియజేశారు. తప్పులు చేసిన బిఆర్ఎస్ నేతలు ఇప్పుడు తమపై దుష్ప్రచారం చేస్తున్నారని భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టు-కుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉద్ఘాటించారు. 2,55,324 లక్షల ఎకరాలకు సాగునీటిని విడుదల చేశామని తెలిపారు. గత ఏడాది కనీవినీ ఎరుగని వరదల కారణంగా సాగర్ మెయిన్ కెనాల్ పూర్తిగా కొట్టు-కుపోయిందని.. దానిని పునరుద్ధరించామని తెలిపారు. నాగార్జున సాగర్ ఆయకట్టుకు పూర్తి స్దాయిలో సాగునీరు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. కృష్ణా బేసిన్‌లో వచ్చే నీటితో మొదటి పంటకు ఎలాంటి ఢోకా లేదని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వరుణ దేవుడి అండ ఉందని.. ఇది శుభసూచకమని అన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పచేసినా.. తమ ప్రభుత్వంలో రైతులకు అండగా నిలబడ్డామని నొక్కిచెప్పారు. తొమ్మిది రోజుల్లో రూ. 9 వేల కోట్లు అన్నదాతల ఖాతాలో వేశామని స్పష్టం చేశారు. రైతును రాజు చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ

లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉద్ఘాటించారు. ప్రస్తుతం 400 క్యూసెక్కుల నీరు విడుదల చేశామని అన్నారు. రాబోయే 5 రోజుల్లో పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరువిడుదల చేస్తామని తెలియజేశారు. ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా రైతు పథకాలు అమలు చేస్తున్నామని, రైతుభరోసా రైతులకు ఎకరాలకు రూ.12 వేలు అందించామని, రైతుల ఖాతాల్లో 9 రోజుల్లో రూ. 9 వేల కోట్లు-జమ చేశామని చెప్పారు. సన్న ధాన్యానికి క్వింటాళ్లకు రూ. 500 బోనస్ ఇస్తున్నామని, రాబోయే రోజుల్లో మిగిలిన పంటలకు కూడా బోనస్ ఇస్తామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

## నేటి నుంచి భారత్-అమెరికా వాణిజ్య చర్చలు..!

మొదటి పేజీ తరువాయి

ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం భారత్-అమెరికా మధ్య నేటి నుంచి మరో విడత చర్చలు అమెరికాలోని వాషింగ్టన్‌లో మొదలుకానున్నాయి. ఇప్పటికే భారత వాణిజ్యశాఖ అధికారులతో కూడిన ఓ బృందం అక్కడికి చేరుకొంది. ఇక దీనిలో చీఫ్ నెగోషియేటర్‌గా వ్యవహరిస్తున్న వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్ మాత్రం బుధవారం ఈ బృందంతో చేరనున్నారు. నాలుగు రోజులపాటు జరగనున్న ఈ కీలక చర్చలు గురువారం ముగియనున్నాయి.

వ్యవసాయం, ఆటోమొబైల్ వంటి రంగాల్లో నెలకొన్న చిక్కుముడులను తొలగించడానికి ఇరు దేశాలకు చెందిన బృందాలు తీవ్రంగా యత్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా కూడా అదనపు టారిఫ్‌ల అమలును వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఆగస్టు 1వ తేదీ వరకు పలు దేశాలకు గడువును పొడిగించింది. భారత్ ఈ చర్చల్లో పూర్తి స్థాయి ద్వైపాక్షిక్ష వాణిజ్య ఒప్పందం కోసం ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో ఆగస్టు నాటికి దీనిలో తొలివిడత డీల్‌ను కుదుర్చుకోవాలని.. ఆ తర్వాత కూడా చర్చలను కొనసాగించి పూర్తి స్థాయి ఒప్పందానికి రావాలని ప్రయత్నిస్తోంది.

భారత్ వ్యవసాయం, పాల ఉత్పత్తుల విషయంలో అమెరికాకు టారిఫ్‌ల్లో రాయితీలు ఇవ్వడానికి ఇష్టపడటంలేదు. అసలు భారత్ ఈ రంగాల్లో ఏ దేశానికి ఎలాంటి రాయితీలు కల్పించలేదు. ఇక మరోవైపు 26 శాతం టారిఫ్‌లను అమెరికా తొలగించాలని కూడా బలంగా కోరుతోంది. ఇక స్టీల్‌పై 50శాతం, ఆటో సెక్టార్‌పై 25శాతం పన్ను తొలగించాలని కోరుతుంది.

## అన్‌డాకింగ్ విజయవంతం..

### మరికొన్ని గంటల్లో భూమిపైకి శుభాంశు

మొదటి పేజీ తరువాయి

అంతరిక్ష కేంద్రంతో శుభాంశు బృందాన్ని తీసుకువస్తున్న 'డ్రాగన్' వ్యోమనౌక అన్‌డాకింగ్ ప్రక్రియ విజయవంతమైంది. పలు విన్యాసాల అనంతరం భూవాతావరణంలోకి ప్రవేశిస్తుంది. ఈ వ్యోమనౌక దాదాపు 21గంటల పాటు ప్రయాణించి మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు అమెరికాలోని కాలిఫోర్నియా తీరానికి చేరువలో సముద్ర జలాల్లో దిగుతుంది. అనంతరం వారిని అక్కడి నుంచి క్వారంటైన్‌కు తరలిస్తారు. దాదాపు వారం రోజుల పాటు వ్యోమగాములు ఫ్లైట్ సర్జన్ పర్యవేక్షణలో ఉంటారు.

యాక్సియం-4 మిషన్‌లో భాగంగా శుభాంశు బృందం గత నెల 25న నింగిలోకి దూసుకెళ్లిన విషయం తెలిసిందే. 28 గంటల ప్రయాణం అనంతరం 'ఐఎస్ఎస్'లోకి ప్రవేశించింది. వీరి బృందం దాదాపు 18 రోజుల పాటు పలు ప్రయోగాలు చేసింది. ప్రయోగాల్లో భాగంగా వ్యోమగాముల బృందం తమ మానసిక ఆరోగ్యంపై అధ్యయనం నిర్వహించింది. ఖగోళంలోని జీరో గ్రావిటీ పరిస్థితుల్లో మానవ కండరాలకు కలిగే నష్టంపై శుక్లా అధ్యయనం చేశారు. ఖగోళంలో మానవ జీర్ణ వ్యవస్థ ఎలా పనిచేస్తుందన్న అంశంపై ఒక వీడియోను భారత విద్యార్థుల కోసం రూపొందించారు.

## అత్తింటి వేధింపులు భరించలేక డెంటిస్ట్ ఆత్మహత్య




హసన్‌పర్తి: అత్తింటి వేధింపులు భరించలేక ఓ దంత వైద్యురాలు (డెంటిస్ట్) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా కమలాపూర్ మండలం మంగపేటకు చెందిన వైద్యుడు సృజన్‌తో వరంగల్‌కు చెందిన డెంటిస్ట్ ప్రత్యూషకు 2017లో వివాహమైంది. పెళ్లి సమయంలో వరుడికి రూ.30లక్షల కట్నం, 30 తులాల బంగారం, ఖరీదైన కారు ఇచ్చారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. కొంతకాలం హైదరాబాద్‌లో ఉన్న ఈ కుటుంబం.. గతేడాది హసన్‌పర్తిలోని కాకతీయ వింటేజ్ విల్లాస్‌లో స్థిరపడింది. కొన్నాళ్ల క్రితం సృజన్‌కు హనుమకొండకు చెందిన ఓ యువతితో వివాహేతర సంబంధం ఏర్పడింది. దీంతో తన కుటుంబాన్ని నిర్లక్ష్యం చేయడమేకాకుండా భార్య ప్రత్యూషను మానసికంగా, శారీరకంగా వేధించడం మొదలుపెట్టాడు. అత్తమామలు కూడా వారి కుమారుడికే మద్దతుగా నిలుస్తూ కోడల్ని వేధించారు. దీంతో మనస్తాపానికి గురైన ప్రత్యూష ఆదివారం భర్త ఇంట్లో ఉండగానే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన భర్త, స్థానికులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధరించారు. అయితే, ప్రత్యూష ఒంటిపై గాయాలు ఉండటంతో ఆమె తల్లిదండ్రులు హసన్‌పర్తి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రత్యూషది ఆత్మహత్య కాదని.. భర్త, అత్తమామలు చిత్రహింసలకు గురిచేసి చంపి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సృజన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

## ఆస్పత్రిలో చేరిన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్

మొదటి పేజీ తరువాయి

జులై 12న హైదరాబాద్‌లోని నల్సార్ న్యాయ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. ఆ తర్వాతే ఇన్ఫెక్షన్ బారిన పడినట్లు తెలుస్తోంది. అదేరోజు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించిన ' భారత రాజ్యాంగ రూపకల్పనలో అంబేద్కర్' అనే అంశంపై జస్టిస్ గవాయ్ ప్రసంగం చేశారు. బాబాసాహెబ్ డా.బీఆర్ అంబేద్కర్ -రాజ్యాంగ సభ- భారత రాజ్యాంగం' పేరిట పోస్టల్ కవర్‌ను విడుదల చేశారు.

## డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే తెలంగాణలో అభివృద్ధి సాధ్యం: రామచందర్‌రావు



చౌటుప్పల్: తెలంగాణలో భాజపా ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కార్యకర్తలు విజయ సంకల్పం తీసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు పిలుపునిచ్చారు. ఉమ్మడి నల్గొండ జిల్లా పర్యటనలో భాగంగా చౌటుప్పల్‌కు వచ్చిన ఆయనకు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. అనంతరం నిర్వహించిన సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్‌ను ఎందుకు ఎన్నుకున్నామని ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు.

"భాజపా ప్రభుత్వం మాత్రమే తెలంగాణలో స్వర్ణయుగం తెస్తుంది. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో మాత్రమే తెలంగాణ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుంది. గత భారాస ప్రభుత్వం అవినీతిమయమైంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల్ని ఇబ్బందులు పెడుతోంది. తెలంగాణ ప్రజలు ఈ రెండు పార్టీలకు ప్రత్యామ్నాయంగా భాజపా వైపు చూస్తున్నారు" అని రామచందర్‌రావు అన్నారు.

# జమ్మికుంట రైల్వే స్టేషన్ ను సందర్శించిన బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి...

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జూలై 14**
జమ్మికుంట రైల్వే స్టేషన్ ను బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి సోమవారం రోజున స్థానిక బిజెపి శ్రేణులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి జమ్మికుంట రైల్వే స్టేషన్ అధికారులతో మాట్లాడి రైల్వే స్టేషన్ ఉన్న సమస్యలు, ప్రయాణికుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రైల్వే అధికారులు చెప్పిన పలు విషయాలను, సమస్యలను కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ దృష్టికి తీసుకువెళ్తానని గంగాడి కృష్ణారెడ్డి చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జమ్మికుంట రైల్వే స్టేషన్ ప్రయాణికుల మరియు సరుకు రవాణా రాకపోకులకు ఎంతో కీలకమైందన్నారు. రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కరీంనగర్ పార్లమెంటు సభ్యులు, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ జమ్మికుంట రైల్వే స్టేషన్ ను మరింత అభివృద్ధి చేయించాలనే లక్ష్యంతో ఉన్నారని తెలిపారు. ఆదిశగా జమ్మికుంట రైల్వే స్టేషన్



ను అమృత్ భారత్ రైల్వే స్టేషన్ లో భాగంగా ఆధునికరించడానికి తగిన కృషి చేస్తున్నారని తెలిపారు. జమ్మికుంట ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే విషయంలో రైల్వే పుట్ ఓవర్ బ్రిడ్జిని కొత్తపల్లి వరకు పొడిగింపు, లిఫ్ట్ సౌకర్యం, హై లెవెల్ ప్లాట్ ఫామ్ నిర్మాణం ముఖ్యమైన పలు రైళ్లు జమ్మికుంట రైల్వేస్టేషన్లో హాల్టింగ్ అయ్యే విధంగా కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ చర్యలు తీసుకున్నారని వివరించారు. ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, జమ్మికుంట మండల అధ్యక్షులు



సంపత్ రావు, హుజూరాబాద్ పట్టణ అధ్యక్షులు తుర్పాటి రాజు, కమలాపూర్ మండల అధ్యక్షులు ర్యాకం శ్రీనివాస్, జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, జీడి మల్లేష్, శీలం శ్రీనివాస్, రమా రెడ్డి, రాజేష్ ఠాకూర్, పల్లపు రవి, కైలాసకొటి గణేష్, ఎదులాపురం అశోక్, బచ్చు శివన్న, మోతె స్వామి, కొండ్లె నగేష్, యాంసాని సమ్మయ్య, ఇటుకాల స్వరూప, రాకేష్ ఠాకూర్, నిరుపరాణి, కేస స్వరూప, బల్సుకూరి రాజేష్, ఉడుగుల రవి, కొమ్ము అశోక్, పోడెటి అనిల్, రామస్వామి, రాచపల్లి ప్రశాంత్, శ్రీవర్తి అఖిల్, ఉడుగుల మహేందర్, మురికి మహేష్, మేక సుధాకర్ రెడ్డి, చందా సంతోష్ తదితరులు పాల్గొన్నారు

# సోలార్ సిసి కెమెరా అందజేసిన కాంగ్రెస్ నాయకులు మద్దుల ప్రశాంత్ పటేల్..



**కరపత్రం ప్రతినిధి వీణవంక జూలై 14**
వీణవంక మండల పరిధిలోని లస్మక్క పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకులు మద్దుల ప్రశాంత్ పటేల్, వీణవంక ఎస్సై ఆవుల తిరుపతి కోరిక మేరకు సోమవారం సోలార్ సిసి కెమెరాను అందజేశారు. అనంతరం మద్దుల ప్రశాంత్ పటేల్ మాట్లాడుతూ.. నేర పరిశోధన విభాగంలో ప్రముఖ పాత్ర వహించేవి సిసి కెమెరాలను, గ్రామ గ్రామాన అనుకోని ప్రమాదాలు, దొంగతనాలు, కొట్లాటలు, యాక్సిడెంట్లు జరుగుతున్నాయని, ప్రమాదాలను ఎప్పటికప్పుడు నివారించేందుకు, దొంగలను పట్టుకునేందుకు, నిఘా నేత్రాలు, ప్రజలకు రక్షణ కవచాలుగా పనిచేస్తూ, ప్రముఖ పాత్ర వహిస్తాయని, పోలీసులకు నిఘా నేత్రాలు నేర పరిశోధనలో సహకరిస్తాయని, అప్పుడే బాధితులకు తక్షణ న్యాయం చేయకుతుందన్నారు. సోలార్ సిసి కెమెరా అందజేసిన మద్దుల ప్రశాంత్ పటేల్ కు ఎస్సై ఆవుల తిరుపతి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దుల ప్రశాంత్ పటేల్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# దిలీప్ ని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోలేదన్న ఆక్కసుతోనే విమర్శలు

- దిలీప్ ఒక బ్లాక్మెలయిర్,అక్రమ దందాలకు కేరాఫ్ అడ్రస్
- కౌశిక్ రెడ్డి బిజెపి నాయకులతో టచ్ లో ఉన్నది నిజం కాదా?
- కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు సందమల్ల నరేష్

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ జూలై 14**
బిఆర్ఎస్ పార్టీ నాయకుడు దిలీప్ ని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోలేదనే అక్కసుతోనే ప్రణవ్ బాబు పై విమర్శలు చేస్తున్నాడని కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు సందమల్ల నరేష్ ఆరోపించారు.సోమవారం హుజరాబాద్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొలుగు దిలీప్




ఒక బ్లాక్మెయిల్ అని అక్రమ దందాలకు కేరాఫ్ అడ్రస్ గా,చెల్లెలి కౌన్సిలర్ పదవిని అడ్డం పెట్టుకొని అక్రమ దందాలు చేసే దిలీప్ కు ప్రణవ్ బాబుని విమర్శించే నైతికస్థాయి లేదని,స్థానిక ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి హుజురాబాద్ ప్రజలను బ్లాక్ మెయిల్ చేసి,సెంటిమెంట్ తో గెలిస్తే,బ్లాక్మెయిల్ నాయకుడికి బ్లాక్మెయిల్ శిష్యులే ఉంటారని మరోసారి రుజువు చేశారని,ఇదే దిలీప్ పార్లమెంటు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీలో చేరడానికి సిద్ధమైతే ఇతని ప్రవర్తన వలన తిరస్కరించారని,జమ్మికుంట అంగడి టెండర్ రూపంలో 30 లక్షల 3వేల రూపాయల ప్రభుత్వ సొమ్మును కాజేస్తే ఓ.ఎస్ నెంబర్ 59/2017 కింద దిలీప్ పై కేసు నమోదు చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు?ప్రణవ్ ఎవరిని చూసి రాజకీయం నేర్చుకోవాల్సిన అవసరం లేదని,రాజకీయంలో పుట్టిందే వారీ ఇంట్లో అని అది మర్చిపోకూడదని అన్నారు.పాడి కౌశిక్ రెడ్డి అనుచరులు చిల్లర మాటలు,అసృత ఆరోపణలు,అనుచిత వ్యాఖ్యలు చేస్తే బట్టలు ఊడదీసి కొడతామని హెచ్చరించారు.ఈ విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ దుబాసి బాబు,సీనియర్ నాయకులు సందమల్ల బాబు,బత్తిని రవీందర్ గౌడ్,బండ నవీన్,ముక్క రవితేజ,కె.ఆర్.బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ సిబ్బంది కారోబార్ ,కార్మికుడి,పై దాడి చేసిన, వ్యక్తులపై కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలి

- సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ డిమాండ్ చేశారు




**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట జూలై 14**
ఇల్లంతకుంట మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో సోమవారం రోజున పంచాయతీ కార్మికులతో కలిసి శనివారం రోజున కారోబార్ కార్మికుడి పై జరిగిన దారికి నిరసనగా విలేకరుల సమావేశం నిర్వహించి కొప్పుల శంకర్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు భద్రత లేకుండా, బరోస లేకుండా, ప్రజల్లో చులకన భావంతోటి చూస్తున్నారని, విధి నిర్వహణలో ఉన్న సిబ్బందిపై నానా దుర్భాషలాడి దాడి చేసిన వ్యక్తులపై వెంటనే, పోలీస్ శాఖ, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేనియెడల యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని దిగుతామని, లేదంటే గ్రామపంచాయతీ విధులను నోటీసు ఇచ్చి బహిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు కొత్తూరు మల్లయ్య, మండల నాయకులు రాచపల్లి మొగిలి, చందగల కుమార్, రాకేష్, దేవేందర్, మల్లేష్ తదితర కార్మికులు పాల్గొన్నారు.

# 42శాతం రిజర్వేషన్లు అమలు అందరి బాధ్యత

- పూలే ఆశయ సాధన సమితి (పాస్) అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్

**కరపత్రం ప్రతినిధి-హనుమకొండ:**
ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ ఆగదని, ఆర్డినెన్స్ తెచ్చుటకు విపక్షాలు సహకరించాలని పూలే ఆశయ సాధన సమితి (పాస్) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ అన్నారు. సోమవారం కాకతీయ యూనివర్సిటీ లోని జర్నలిజం విభాగంలో పూలే ఆశయ సాధన సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు డాక్టర్ తాడూరి శాస్త్రి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా సమావేశం జరిగింది. దీనికి పాస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ.. ఏడూ దశాబ్దాలుగా బడుగుల వెలుగులకు అడ్డంకి ఉన్న రిజర్వేషన్ల అమలు కోసం నాటి ప్రభుత్వాలు ప్రయత్నం చేయలేదన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు నుండి కూడా కామారెడ్డి డిక్లరేషన్ అమలుకు అనేక




చర్యలు తీసుకున్నదని అందులో భాగంగా కులగణన చేసి, శాసనసభ లో తీర్మానం చేసి పంపిస్తే చట్టబద్ధత చేయకుండా బీజేపీ ప్రభుత్వం నానబెట్టి కాంగ్రెస్ పై నెపం నెట్టే ప్రయత్నం చేసిందని దుయ్యబట్టారు. సీఎం రేవంత్ మాట ఇచ్చిన ప్రకారం బీసీలకు నష్టం జరుగద్దని, మంత్రిమండలి ఏర్పాటు చేసి ఆర్డినెన్స్ తెచ్చేందుకు తీర్మానం చేయడం శుభపరిణామమని కొనియాడారు.1993లో విద్య,ఉద్యోగాలలో 69శాతం రిజర్వేషన్లు అమలు చేసినప్పుడు తమిళనాడు ప్రభుత్వం మద్దతుగా నాడు రక్షణగా కేంద్ర ప్రభుత్వం మద్దతుతో తొమ్మిదవ షెడ్యూల్ లో చేర్చి చట్టబద్ధత కల్పించిందని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తొమ్మిదవ షెడ్యూల్ ల్లో చేర్చి చట్టబద్ధత కల్పించి విద్యా,ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలనీ,అప్పుడే మీ విశ్వసనీయతకు డోకా ఉండదని, ఆలా కాకుండా దొంగ దారుల్లో అడ్డంకులు సృష్టిస్తే వచ్చే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.ఈ సమావేశం రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి గారికి,పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ ,రాష్ట్ర బిసి సంక్షేమ మంత్రి పొన్న ప్రభాకర్ ,తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ తీర్మాణం చేసింది. ఈ కార్యక్రమంలో పాస్, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు డాక్టర్ తాడూరి శాస్త్రి. పాస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చందా మల్లయ్య,ఉమ్మడి జిల్లా కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, పాస్ నాయకులు శ్రీరాం వీరయ్య, డాక్టర్ వంగల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ చాలీసా పారాయణం...

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న దేవస్థాన చైర్మన్ ఇంగిలే రామారావు

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట జూలై 14**
మంచిర్యాల్ జిల్లా లక్షెట్టిపేట్ పట్టణము నుండి ఇంటింటా హనుమాన్ చాలీసా నిత్య పారాయణం చేస్తూ ఈరోజు 4223 వ రోజుసందర్బంగా సుమారుగా 12 సంవత్సరాల నుండి హనుమాన్ చాలీసా భక్త బృందం జైన శ్రీనివాస్ ఆధ్వర్యంలోఈ రోజు ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు కమిటీ సభ్యులు నాగేష్ రాంరెడ్డి,పరమేశ్వర్ ఆలయ సిబ్బంది మోహన్, ప్రవీణ్ ఆలయ అర్చకులు వంశీధరచార్యులు, నవీన్ శర్మ పాల్గొన్నారు. హనుమాన్ చాలీసా పారాయణం చేసారు. ఈ సందర్భంగా వచ్చిన భజన భక్తులు మాట్లాడుతు మాకు సహాయ సహకారాలు అందించిన వారందరికీ ధన్యవాదాలు తెలుపుతూ ఈరోజు రాములవారి దర్శనం చేసుకుని హనుమాన్ పారాయణము జైశ్రీరామ్, రామ లక్ష్మణ జానకి జై బోలో హనుమాన్ కి జై అంటూ హనుమాన్ పారాయణంతో దేవాలయం అంత రామ నామాలతో ప్రతిధ్వనించడం జరిగింది. అనంతరం ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు మాట్లాడుతూ సుమారుగా 130 కిలోమీటర్లు దూరం నుండి వచ్చిన హనుమాన్ భక్త బృందానికి దేవుని కరుణ కటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని వారు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలుతో ఉండాలని అభినందిస్తూ శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దర్శించుకున్న వారికి దేశంలో ఎక్కడి నుండి వచ్చిన భక్తులకు శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కృప కటాక్షాలు ఎల్లవేళలా ఉంటాయని అన్నారు.





# ఎస్సై కి సన్మానం చేసిన దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట జూలై 14**
ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్ కు ఇటీవల బదిలీపై వచ్చి ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన క్రాంతి కుమార్ ని మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు గారు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేసి దేవస్థానం యొక్క మెమొంటోను బహుమతిగా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ ఎస్సై తో మాట్లాడుతూ గ్రామాలలో ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు తమరి దృష్టికి వచ్చినవి పరిష్కరించాలని శాంతి భద్రతలకు ప్రాముఖ్యత ఇవ్వాలని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు శాంతియుతంగా జరిగే విధంగా అన్ని పార్టీల



నాయకులకు తగిన సూచనలు చేయాలని అన్నారు. నేరాల నియంత్రణలో పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో పోలీస్ శాఖకు కాంగ్రెస్ పార్టీ పక్షాన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని న్యాయం కోసం పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందించి వారికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి సుధాకర్, ధర్మకర్తలు పరమేష్, కిరణ్, తిరుపతిరెడ్డి, కిషన్ రెడ్డి,చిరంజీవి, రామ్ రెడ్డి, రాజేందర్,నగేష్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక

మంగళవారం జూలై 15 2025

# శరవేగంగా వకుళా మాత అన్నదాన భవన నిర్మాణ పనులు

– పరిశీలించిన ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు





**కొత్తపేట (ఏపీ) కరపత్రం ప్రతినిధి**
కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి తరలివచ్చే భక్తులకు నిత్యాన్నదాన నిమిత్తం శ్రీనివాస ప్రాంగణంలో నిర్మిస్తున్న శ్రీ వకుళా మాత అన్నదాన భవనం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు ఈ పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. త్వరలోనే వకుళమాత అన్నదాన భవనం పనులు పూర్తవుతాయని, ఒకేసారి 3,500 వేల మంది భక్తులు భోజనం చేసే విధంగా ఈ భవన నిర్మాణం జరుగుతున్నట్లు కార్యనిర్వహణధికారి నల్లం సూర్య చక్రధర రావు వారు తెలిపారు.

# భయానక వాతావరణం నుంచి భరోసా వైపు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**కొత్తపేట(ఏపీ) కరపత్రం ప్రతినిధి**
కొత్తపేట మండలం పలివెల గ్రామంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలోకొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొన్నారు.వైసీపీ హయాంలో గ్రామాల్లో సైతం అశాంతి నెలకొని ఉండేదని, రాష్ట్రమంతా ఒక భయానక వాతావరణం వ్యాపించి ఉండేదని కూటమి అధికారంలోకి వచ్చాక ప్రశాంతత నెలకొందని, రాష్ట్ర అభివృద్ధికి భరోసా లభించిందని వ్యాఖ్యానించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నుంచి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలివెల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు ఎమ్మెల్యే బండారు వద్ద కూటమి ప్రభుత్వ పాలనపై సంతృప్తి వ్యక్తం చేశారు.

# స్ఫూర్తి శిఖరం బాబా సాహెబ్ అంబేద్కర్.....





**కొత్తపేట (ఏపీ) కరపత్రం ప్రతినిధి**
కొత్తపేటలోని రెడ్డప్ప వారి పేటలోసోమవారం ఏర్పాటుచేసిన బాబాసాహెబ్ అంబేద్కర్ నూతన విగ్రహాన్ని అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్ తో కలిసి ఎమ్మెల్యే బండారు ఆవిష్కరించారు, వారుఆ నూతన విగ్రహనికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాటాడుతూ ప్రజాస్వామ్య, గణతంత్ర,లౌకిక దేశంగా భారతదేశం ప్రపంచ పటంలో ఉన్నత స్థానంలో నిలబడడానికి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అందించిన సేవలు నిరుపమానమని , అసమానతలు లేని సమాజం కోసం బాబాసాహెబ్ అంబేద్కర్ నిరంతరం పోరాడారని వ్యాఖ్యానించారు. నాటి, నేటి, భావితరాలకు ఆయన ఒక స్ఫూర్తి శిఖరమని కొనియాడారు. అంబేద్కర్ బాటలో పయనించడం ద్వారా మనమంతా ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని కోరారు.

# ఏవో ధర్మ ప్రసాద్ సేవలు ప్రశంసనీయం...



**– డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ (ఏపీ) కరపత్రం ప్రతినిధి**
అమలాపురం మండల వ్యవసాయ శాఖ అధికారిగా పనిచేసిన కడలి ధర్మ ప్రసాద్ సేవలు ప్రశంసనీయమని రెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ కరాటం రత్న ప్రసన్న ప్రవీణ్ కొనియాడారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇటీవల అంబాజీపేట మండలం బదిలీ అయిన ఏవో ధర్మ ప్రసాద్ కు స్థానిక రెడ్డిపల్లి గ్రామపంచాయతీలో సోమవారం సన్మాన సభ నిర్వహించారు. ఆయనకు దుస్సాల్వా కప్పి పూలమాలలతో ఘన సత్కారం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రత్న ప్రసన్న ప్రవీణ్ మాట్లాడుతూ మండల వ్యవసాయ శాఖ అధికారిగా ధర్మ ప్రసాద్ పని చేసినంతకాలం రైతులకు ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. ఎవరు మనస్సు నొప్పించకుండా అందరితో మర్యాదపూర్వకంగా మెలిగారన్నారు. ఈ కార్యక్రమంలో కరాటం సూర్య భాస్కర్ రావు, కొలిశెట్టి జయప్రకాష్, సచివాలయ ఉద్యోగులు గణపతి, నెల్లి వెంకటలక్ష్మి, మహేష్, దొరబాబు, ఎన్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అందుబాటులో ఉంటూ సేవలందించాలి





**ఆలమూరు(ఏపీ) కరపత్రం ప్రతినిధి**
చింతలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షునిగా ఎన్నికైన నల్లా వెంకటేశ్వరరావు, (వెంకన్న) సోమవారం కొత్తపేట జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. సంధిపూడి నుంచి,జనసేన నాయకులు, కార్యకర్తలతో కల్సి బయలుదేరిన ఆయన వాడపాలెం చేరుకుని ముందుగా బండారు శ్రీనివాస్ స్వగృహంలో ఆయనను కలిసి తనకు వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షునిగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ తగిన సేవలందించి పార్టీకి మంచి పేరు తీసుకురావాలని వెంకన్నకు బండారు శ్రీనివాస్ సూచించారు. అనంతరం వాడపాలెంలోని ఎమ్మెల్యే బండారు స్వగృహానికి చేరుకున్నారు. అక్కడ అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావులను కలుసుకొని కృతజ్ఞతలు తెలియజేశారు. వెంకన్నను వారిరువురు అభినందించారు. సంగీత సుభాష్,తోట భవాని వెంకటేశ్వర్లు,తోలేటి సంతోషి అంజిబాబు, గారపాటి శ్రీనివాస్ చౌదరి,పెద్దిరెడ్డి పట్టాభి, సలాది జై ప్రకాష్ నారాయణ, బైరిశెట్టి రాంబాబు, దొడ్డ సత్తిపండు, దొడ్డ పుల్లయ్య, పళ్ళ ప్రసాద్, , రాంబాబు, పోలా బత్తుల అంజి బాబు, పి, నాగు,పి మని, సలాది వెంకన్న, గేదెల గంగయ్య, ఎస్ మూల స్వామి, సలాది శ్రీను, పామర్తి శ్రీను, పామర్తి పల్లంరాజు, ఎస్ గంగరాజు, కీర్తి శ్రీనివాస్, విజయ్, విందు, పసుపులేటి వీరబాబు, వీరబాబు, సామశివ, వెంకన్న, నల్లా బ్రదర్ ఈ కార్యక్రమంలో కార్యకర్తలు జన సైనికులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ బాదిత కుటుంబానికి అండగా ప్రభుత్వం..

– ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం సబ్స్టేషన్ ఎదుట డెడ్ బాడీని ఉంచి ఆరు గంటలపాటు నిరసన వ్యక్తం చేసిన బాధిత కుటుంబం..
– సమస్య జటిలం కాకుండా సముదా యించిన సయ్యద్ సాదిక్ అలి..
– మంత్రి పొంగులేటికి మెసేజ్ ద్వారా ఆందోళన అంశాన్ని తెలియపరచి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేసిన సయ్యద్ సాదిక్ అలి.





**ఖమ్మం కరపత్రం ప్రతినిధి:-**
ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కు గురై ఒక వివాహిత మహిళ మృత్యువాత పడిన సంఘటన పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్ మండలం కస్నా తండాలో జరిగింది.. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ.. మృతురాలి బంధువులు పల్లెగూడెం సబ్ స్టేషన్ ఎదుట సుమారు 6 గంటలపాటు మృతదేహంతో నిరసన వ్యక్తం చేశారు..అనంతరం మహబూబాబాద్ ప్రధాన రహదారి రహదారి వద్ద మృతదేహాన్ని ఉంచి అంతరాయం కలిగించారు.సమాచారం అందుకున్న రాజ్యాంగ పరిరక్షణ వేదిక సంస్థ జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలి స్పందించి ఆందోళనను విరమింపచేసే ప్రయత్నం చేస్తూ.. రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కు ఫోను ద్వారా, సందేశం ద్వారా సమాచారం చేర వేయగా తక్షణమే మంత్రి పొంగులేటి స్పందించి తహశీల్దార్ ను పంపినట్లు సయ్యద్ సాదిక్ అలి వివరించారు.. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే విధంగా కృషి చేసిన మంత్రి పొంగుకటికు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు..

**వివరాల్లోకి వెళితే...**

పాలేరు నియోజకవర్గం లోని కస్నా తండా గ్రామంలో 11 కెవి విద్యుత్తు లైను దాబా పైన ఉండగా విద్యుత్ తీగలను గమనించకుండా మహిళ మారుతి మాధవి (42) ఉదయం 9 గంటలకు దుస్తులు ఆరేస్తూ... విద్యుత్ ఘాతానికి గురయ్యారు.. బాధిత మహిళకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.. సంఘటన స్థలానికి రూరల్ ఏసిపి తిరుపతిరెడ్డి, రూరల్ తహసిల్దార్ రాంప్రసాద్ లు చేరుకొని బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపునుంచి చెందాల్సిన నష్టపరిహారాన్ని ప్రభుత్వంతో మాట్లాడి అందింపచేస్తామని హామీ ఇవ్వగా బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనను విరమించారు..

# బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**కొత్తపేట (ఏపీ) కరపత్రం ప్రతినిధి**
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం కొత్తపాలెం గ్రామంలో ఉన్న జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళుతున్న 9 మంది ఉపాధ్యాయులు హెచ్ఎం శర్మ, ఏ సాంబశివరావు, మారుతి శ్రీనివాస్, ఎం శ్రీనివాస్,ఎంఎస్ కుమార్, వై నాగమణి,శ్రీ వాణి, డి వెంకటలక్ష్మి వీరికి స్కూల్ విద్యార్థులు సహచర ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు వారిని ఘనంగా సత్కరించారు. ఈ సమావేశానికి హెచ్ఎం ఏ సూర్యనారాయణ అధ్యక్షత వహించారు,గ్రామ సర్పంచ్ నెల్లి లక్ష్మీపతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా ఇక్కడ విధులు నిర్వహిస్తూ నేడు బదిలీపై వెళ్తున్న మాకు స్కూలు పిల్లల మధ్య గడిచిన రోజులు గుర్తుచేసుకుంటుంటే చాలా బాధగా ఉందని అనేక కుటుంబాలను వదిలి దూరంగా వెళ్తున్నట్లు అనిపిస్తుందని ఇన్నాళ్లు మీకు పాఠాలు నేర్పి మీలో మీ కుటుంబంలో సభ్యులుగా మారిపోయామని నేడు మిమ్మలను వదిలి వెళుతున్నందుకు ఎంతో బాధగా ఉందని కానీ విధి నిర్వహణలో తప్పని పరిస్థితి కాబట్టి మిమ్మల్ని వదిలి వెళ్ళటం తప్పటలేదని భావోద్వేగంతో వారు మాట్లాడిన విధానం అందర్నీ కొంత బాధకు గురి చేసింది. విద్యార్థులతోటి గ్రామ పెద్దలతో వారు గత జ్ఞాపకాలను గుర్తుచేస్తూ విద్యార్థులందరూ బుద్ధిగా పాఠాలు నేర్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా విద్యార్థులందరినీ దీవిస్తున్నామని అన్నారు. ఈ సమావేశానికి గ్రామ పెద్దలు దంగేటి చంటి,కాజ నారాయణరావు, బొక్క తిరుపతిరావు, తోటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# నాట్య ప్రదర్శనలో ప్రతిభ చూపిన విద్యార్థినులకు అభినందన

**ఆలమూరు (ఏపీ) కరపత్రం ప్రతినిధి**



ఆలమూరులోని శ్రీ సిద్ధార్థ పాఠశాల విద్యార్థినిలు నాట్య ప్రదర్శన, పోటీల్లో ప్రతిభ చూపారు. ఈనెల 10 నుండి 13వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగిన 36వ ఆలిండియా క్లాసికల్ అండ్ ఫోక్ డాన్స్ కాంపిటీషన్లో సినీ క్లాసికల్ డాన్స్ జూనియర్ విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థిని డి కావ్యశ్రీ మొదటి బహుమతిని, క్లాసికల్ గ్రూప్ జూనియర్ విభాగంలో రెండవ బహుమతిని గెలిచింది. అలాగే నిడదవోలుకు చెందిన శ్రీ భ్రామ్మరి కూచిపూడి నాట్య నిలయంవారు నిర్వహించిన నాట్య శిరోమణి నృత్యోత్సవం 2025 పోటీల్లో ఎనిమిదో తరగతి విద్యార్థినులు సిహెచ్ ప్రణీత, కె శరణ్య, ఏడవ తరగతి విద్యార్థినులు టి మణి శ్రీ, ఐ చైత్రిక అత్యుత్తమ ప్రతిభ చూపి ప్రశంసాపత్రాలను పొందారు. రాష్ట్ర, జిల్లాస్థాయిలో వివిధ సంస్థలు నిర్వహించిన పోటీల్లో బహుమతులు గెలుచుకున్న విద్యార్థినులను సోమవారం పాఠశాల డైరెక్టర్ ముల్లారావు అభినందించారు. భవిష్యత్తులో సైతం ఉత్తమమైన ప్రతిభ కనపరిచి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గుణశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# ప్రయాణికుల భద్రతకు రైల్వేశాఖ పెద్దపీట - పాలూరి

– రైల్వే బోగీలకు సీసీ కెమెరాల ఏర్పాటు



**కొత్తపేట (ఏపీ) కరపత్రం ప్రతినిధి**
కొత్తపేట: రైల్వే బోగీలకు సీసీ కెమెరాల ఏర్పాటుకు రైల్వే శాఖ నిర్ణయం తీసుకుందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం తెలిపారు. ప్రయాణికుల భద్రతకు రైల్వేశాఖ పెద్దపీట వేస్తూ కీలక నిర్ణయం తీసుకోవడం శుభ పరిణామం అని ఆయన హర్షం వ్యక్తం చేశారు. సోమవారం పాలూరి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బోగీలలో సీసీ కెమెరాలను దేశవ్యాప్తంగా అమలకు నిర్ణయం తీసుకుందన్నారు. ఇప్పటికే అమలైన పైలెట్ ప్రాజెక్టు విజయవంతం కాగా 74 వేల బోగీలకు 15 వేల లోకోమోటివ్ లలో కెమెరాలు ఏర్పాటు చేయాలని రైల్వేశాఖ నిర్ణయించిందని వివరించారు. బోగీల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై రైల్వే శాఖామంత్రి అశ్వనీ వైష్ణవ్, సహాయకమంత్రి రవ్ నీత్సింగ్ బిట్టు శనివారం ఉన్నతాదికారులతో సమీక్షించి ఆదివారం రైల్వేశాఖ విడుదల చేసిందన్నారు. రైల్వే బోగీల్లో దోపిడీలకు పాల్పడే దొంగలు ప్రయాణికుల వస్తువులు దొంగిలించడం, రైల్వే సామాన్లు దొంగిలించడం వంటివి జరగకుండా ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. 100 కిలోమీటర్ల వేగంలో స్పష్టమైన చిత్రాలు వచ్చేలాగ నాణ్యతా ప్రమాణాలతో కూడిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా దోపిడీలు, దాడులు అరికట్టవచ్చని అంచనా వేసి రైల్వే శాఖ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తుందని పాలూరి తెలిపారు.